నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

వంట తంటా!

- కష్టాల కడలిలో మధ్యాహ్న భోజన కార్మికులు
- తక్కువ వేతనాలతో అవస్థలు
- అమలు కాని ముఖ్యమంత్రి హామీ
- రూ.10 వేల కోసం ఎదురుచూపులు
- బిల్లులు అందక వంట ఏజెన్సీల ఇక్కట్లు

వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

ప్రజాశక్తి-రాయచోటి

'మధ్యాహ్నం భోజన కార్మికుల కష్టాలు తనకు తెలుసనని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి రూ.10 వేల వేతంన అందించి అదుకుంటాం' అని ప్రస్తుత సిఎం, అప్పటి ప్రతిపక్ష నాయకులు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లయినా నేటికీ వారికి ఇచ్చిన హామీని నెరవేర్చిన పాపాన పోలేదు. పైగా వారికి చెల్లించాల్సిన బిల్లులను కూడా పెండింగ్‌లో పెంటారు. సుమారు 4 నెలలుగా బిల్లులు అందక వంట ఏజెన్సీలు నానా అవస్థలు పడుతున్నారు. అన్నమయ్య జిల్లాలో 2151 ప్రభుత్వ పాఠశాలలు, 1,32,841 మంది విద్యార్థులు, 3,769 మంది మిడ్డే మిల్స్ కార్మికులు ఉన్నారు. ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో ఆలస్యం చేస్తుండడంతో కొందరు నిర్వాహకులు అప్పు చేసి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు దుకాణాలల్లో అప్పు పుట్టక ఇంట్లో ఉన్న వస్తువులను తాకట్టు పెట్టగా వచ్చిన సొమ్ముతో కూరగాయలు కొని పిల్లలకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. అటు అధికారులు, ఇటు ప్రభుత్వం మధ్నాహ్న భోజన పథకం ఏజెన్సీల బాధలు పట్టించుకోవడం లేదు. కొన్నిచోట్ల గ్యాస్ పోయిలున్నా సకాలంలో సిలిండర్ దొరక్క కట్టెలు తెచ్చి వంట వండుతున్నారు. మరికొన్ని పాఠశాలల్లో గ్యాస్ లేకుండా కట్టెల పొయ్యి మీదనే మధ్యాహ్న భోజనం వంటకం చేస్తున్నారు. అలా వంట చేయడం వల్ల ఆ పొగ గాలి పీల్చడం వల్ల అనేక వ్యాధులు గురవుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం వారి గురించి పట్టించుకోవడం లేదు. బిల్లుల కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను వేడుకున్నా తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరించడం శోచనీయం. ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం పథకం పిల్లలకు అందించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కానీ మెనూ ప్రకారం నిత్యం భోజనం అందించాలంటే కూరగాయల ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇటీవల కాలంలో ఉల్లిపాయలు రూ.30 నుండి ఒక్కసారిగా రూ.80, పచ్చిమిర్చి రూ.80 టమోటా రూ.30, కంది బేడలు రూ.150 పెరిగిపోయాయి. నూనె ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. కొన్ని పాఠశాలలో ఇచ్చే వేతనం సరిపోవడం లేదని కార్మికులు వంట చేడయం మానుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పిల్లలకు రుచికర భోజనం అందించాలంటూ అధికారులు జారీ చేయడమే కాకుండా అప్పుడప్పుడు తనిఖీలు చేయడం గమనార్హం. ఇది ఇలా ఉంటే కోడి గుడ్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. ఆ పంపిణీ చేసిన గుడ్లలో కూడా చాలా గుడ్లు కాలం చెల్లినవి ఉండడం వల్ల వాటిలో చాలా వరకు కుళ్లినవి ఉంటున్నాయి. ఆ గుడ్లల్లో నిత్యం పిల్లలకు ఉడకబెట్టి ఇవ్వాల్సిన పరిస్థితి వంట చేసే వారిదే. నేతలు మారినా తమ రాతలు మాత్రం మారలేదని, ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ యంత్రాంగం స్పందించి తమకు బిల్లులు చెల్లించి, వేతనం అందించే ఆదుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనం పెంచాలి

ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పిల్లలకు వంట చేస్తున్నాం. ఈ పని తప్పితే వేరే పనికి వెళ్లలేకున్నాం. ప్రభుత్వం ఇస్తున్న రూ.3 వేల గౌరవేతనం సరిపోవడం లేదు. ప్రస్తుతం నిత్యావసర సరుకులు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వంట సామగ్రి కూడా మేమే కొనుగోలు చేయాలి. దీనివల్ల కుటుంబాలు పోషించాలంటే ఇబ్బందిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రూ.10 వేల వేతనం పెంచి ఇవ్వాలి.

- పి.మహమ్మద్ రఫీ, మధ్యాహ్న భోజన కార్మికుడు, రాయచోటి.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్ సలాం

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో గిరిజనులకు, గిరిజన విద్యార్థులకు అందుబాటులో ఉండి గిరిజన సంక్షేమమే తమ లక్ష్యమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్ సలాం పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో గిరిజనలకు, గిరిజన విద్యార్థులకు వసతులు, నాణ్యమైన భోజనం ఎలా అందించాలో ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి.

ముఖా ముఖి..

జిల్లాలో పాఠశాలలు, వార్డెన్లు, విద్యార్థులు వివరాలు తెలపండి?

జిల్లాలో 12 గిరిజన గురుకుల పాఠశాల ఉన్నాయి. వాటిలో 1 ఆశ్రమ, 5 బాలికలు, 6 బాలుర పాఠశాలలు ఉన్నాయి. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1799 మంది విద్యార్థులు ఉన్నారు. బాలికలు 845 మంది, బాలురు 954 మంది ఉన్నారు. 12 హాస్టల్లో ఉన్నాయి. నలుగురు రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు ఇతర కిట్లు సరఫరా చేస్తున్నారా?

విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు ఇతర వస్తువులను విద్యార్థులందరికీ సరఫరా చేస్తున్నాం.

వంట మనుషులు ఎంత మంది ఉన్నారు? ఖాళీలు ఏమైనా ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా వంట మనుషులు 6 పోస్టులు మంజూరయ్యాయి. 2 ఖాళీలు ఉన్నాయి. రాయచోటి, సుందపల్లె ప్రాంతాల్లో ఖాళీగా ఉన్నాయి.

జిల్లాలో గిరిజనుల జనాభా ఎంత?

జిల్లాలో గిరిజనుల మొత్తం జనాభా 67,325,స్త్రీలు 32,762, పురుషులు 34,563, నివాసాలు 492, ఆవాసాలు 18,550 మంది ఉన్నారు.

గిరిజనులకు ఏ విధమైన సాయం అందుతుంది?

వైఎస్ఆర్ చేయూత పథకం 45-60 మధ్య వయస్సు గల గిరిజన మహిళలకు, సంవత్సరానికి రూ.18,750 ప్రకారం 4 ఏళ్లకు గాను రూ.75 వేలు మంజూరు చేశాం.

గిరిజనుల మౌలిక వసతులు కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జగ్జీవన్ జ్యోతి పథకం కింద 0 నుండి 200 యూనిట్ల విద్యుత్‌ను ఇంటి అవసరాల నిమిత్తం ఉచితంగా సరఫరా చేయబడును.

గిరిజన పాఠశాలల విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఉపకార వేతనాలు (జగనన్న విద్యా దీవెన) రూ.2.50 లక్షలు లోపు వార్షికాదాయం కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, కాపు, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు చెంది, అర్హత కాలిగిన విద్యార్థులకు ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ. ఆపై కోర్సులకు సంబంధించి, ప్రభుత్వ కళాశాలలో చదువు విద్యార్థుల వారి బోధన ఫీజులు సంబంధిత తల్లుల ఖాతాకు మంజూరు చేస్తాం. జగనన్న వసతి దీవెన పథకం కింద 75 శాతం హాజరు, అర్హతలు కలిగిన ఐటిఐ చదువుచున్న గిరిజన విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ చదువు విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఆపై కోర్సులు విద్యార్థులకు రూ.20 వేలు వారి ఆహార, వసతి ఖర్చుల నిమిత్తం మంజూరు చేస్తాం. గిరిజన విద్యార్థుల ఉన్నత విద్య కొరకు, విదేశాలలోని విద్యను అభ్యసించుటకు 200 ఉన్నత స్థాయి యూనివర్సిటీలలో పిజి, పిహెచ్‌డి, ఎంబిబిఎస్ కోర్సులకు గాను జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద ఆర్థిక సహాయం మంజూరు చేస్తాం. దరఖాస్తుదారుని కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలి. ధరఖాస్తుదారుని వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలి. కళాశాల నిర్ణయించిన ట్యూషను ఫీజుకు 100 శాతం అర్హులు. ఆకాశ మార్గం (విమాన ప్రయాణం)లో ఒన్‌వే ఎకానమి క్లాట్ టికెట్ మొత్తం, వీసా ఫీజు చెల్లిస్తాం. ఆర్థిక సహాయాన్ని 4 కంతులలో విడుదల చేస్తాం. ఒక కుటుంబములో జీవిత కాలంలో ఒకరికి మాత్రమే అర్హులు. ధరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి తేదీగా 30-06-2023గా నిర్ణయించాం. ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులను రాష్ట్ర స్థాయి కమిటీ ద్వారా ఎంపికవుతారు.

నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

వరద బాధితులను ఆదుకోవడానికి ఇంకెన్నాళ్లు?

- నిరసనలో వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య జలాశయం వరద బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వానికి ఇంకెన్నేళ్లు కావాలని వామపక్ష నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని జాతీయ రహదారిలోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.రవికుమార్ మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి విపత్తు సంభవించి రెండు సంవత్సరాలు పూర్తయినా బాధితులకు నేటికీ గుడిసెల్లోనే కుటుంబాలను పోషిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆరు నెలల కల్లా పూర్తి చేసి ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమల్లో ఎక్కడ కనిపించడం లేదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు నాణ్యత లేకుండా ఉన్నాయని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యమా, ప్రభుత్వ నిర్లక్ష్యమా అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకే దిక్కు లేకపోతే పేద, మధ్యతరగతి వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సకలం కోల్పోయి అనాథలుగా ఉన్న తోగూరుపేట, హరిజనవాడ, మందపల్లి ప్రాంతాల్లో నేటికీ నష్టపరిహారం కూడా అందించిన దాఖలాలు లేవన్నారు. రాబోయే వేసవిలో అన్నమయ్య ప్రాజెక్టు నిర్మించకపోతే రాజంపేట ప్రజానీకానికి నీటి సమస్య తప్పదన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో అన్నమయ్య ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని, వరద ప్రభావిత ప్రాంతాలలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి పూర్తిస్థాయిలో నాణ్యతతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో వరద బాధితులు అందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహ, సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్, ఎఐటియుసి నాయకులు నాగేశ్వరావు, వెంకటేష్, బాబ్జాన్, చంద్ర, గంగయ్య పాల్గొన్నారు.

బిసి కులగణనను పారదర్శకంగా చేపట్టాలి

- వాల్మీకి సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన బిసి కులగణనను పారదర్శకంగా చేపట్టాలని, దీనిపైన ఈ నెల 26వ తేదీన బిసి కుల సంఘాల నాయకులు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి కుల సంఘాల నాయకులంత కులగణనను స్వాగతిస్తామన్నారు. ఈ కుల జనగణన పారదర్శకతతో చేయమని ప్రభుత్వ డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజకీయ కుట్రలో బిసిలు బలికాకుండా చూడడానికి 26వ తేదీన మదనపల్లి, నక్కలదిన్ని షటిల్ కోర్టులో పెద్దలందరితో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి అమూల్యమైన సలహాలు, సూచనలను సేకరించి ప్రభుత్వానికి తెలియజేయడానికే ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నమని పేర్కొన్నారు. మేధావులు, కుల సంఘ నాయకులు రాజకీయ పార్టీ నాయకులు మహిళా సంఘాలు ప్రగతిశీల సంఘాలు రైతులు కార్మికులు కర్షకులు యువత ఉద్యోగస్తులు విశ్రాంత ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయమని వాల్మీకి సంఘం అధ్యక్షుడు పులి శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో మేదర సంఘం అధ్యక్షులు తాలే సుబ్రహ్మణ్యం(సుబ్బు), ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సి.చిట్టిబాబు, వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు సద్దల జయసింహ, మదనపల్లి టౌన్ అధ్యక్షుడు వలసలు మంజునాథ్, రాగిమాకులపల్లి యువత అధ్యక్షుడు బొంత సోమశేఖర్, రెండవ వార్డ్ మహిళా అధ్యక్షులు అరవ నిర్మలమ్మ, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు నరసింహులు, పి.నారాయణ, బొంత రామకృష్ణ, కలిచర్ల నరసింహులు, టీ. గంగాధర్, జగన్, కొండయ్యగారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ఒపిఎస్ ఇచ్చే వారికే ఎన్నికల్లో మద్దతు

- యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజ, ఎస్.ఎస్.నాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వారికే రాబోయే ఎన్నికలలో తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజ, ఎస్.ఎస్.నాయుడు పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ భవన్లో జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్ అధ్యక్షతన యుటిఎఫ్ ద్వితీయ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సమా వేశాలలో ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని బి.లక్ష్మీరాజ, యుటిఎఫ్ పతాకాన్ని మాదన విజయకుమార్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బి.లక్ష్మీరాజ, ఎస్.ఎస్.నాయుడు మాట్లాడుతూ పాలకవర్గాలు ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికా రంలోకి వస్తే వారంలోపే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించాడన్నారు. ఆ హామీని నిజమని నమ్మి ఉద్యోగ, ఉపాధ్యాయులు జగన్మోహన్ రెడ్డిని గద్దెనెక్కిస్తే, అధికారంలోకి రాగానే ఉద్యోగ ఉపాధ్యాయులను విస్మరించారని చెప్పారు. సిపిఎస్ రద్దుపై నాలుగేళ్లు కాలయాపన చేసి సిపిఎస్ రద్దు సాధ్యం కాదని ఆ స్థానంలో జిపిఎస్ పేరుతో గ్యారంటీ లేని గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసి ఉద్యోగులను మరోసారి దగా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని, విద్యను ప్రైవేటీక రించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీ ర్యం చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి విద్యను అందకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల పక్షపాతిగా తనకు తాను ప్రకటించుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని ప్రకటించి, ఉన్న వేతనాలలో కోత విధించిన ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కారని ఎద్దేవా చేశారు. మాట తప్పను, మడమ తిప్పను, విశ్వసనీయత కోల్పోతే అధికారంలో కొనసాగను అని ముఖ్యమంత్రి పలికిన పలుకులకు విశ్వసనీయతే లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఏపీజిఎల్ఐ సొమ్ములను రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడం దుర్మార్గమైన చర్య అని వారు విమర్శించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎ, పిఆర్సీ, సరెండర్ లీవ్, ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమను ప్రశ్నిస్తే సహించే స్థితిలో లేదని, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన ఉపాధ్యాయులపై కక్షగట్టి వేధింపులకు పాల్పడుతున్నదని విమ ర్శించారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను నిరంతరం వేధిస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులను నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ పేద, బడుగు, బలహీన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందకుండా చేస్తు న్నారన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 49 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించామని, ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం సభలు సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగడతామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.డి.దేవదత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులంటేనే భయపడుతున్నదని, ఆ భయానికి కారణమేంటో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. హామీలను అమలు చేయాలని ఉపాధ్యాయులు ఉద్యమిస్తుంటే, ఉపాధ్యాయులపై కన్నెర్ర చేస్తూ ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్నారని విమర్శించారు. సమస్యలను పరిష్కరించాలే తప్ప ఉద్యమాలపై నిర్బంధం సమస్యలకు పరిష్కారం కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అన్ని రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.నాగార్జునరెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు జడ్.జయరామయ్య, డి.వి.రవీంద్రుడు, చెరుకూరి శ్రీనివాసులు, సి.వి.రమణ, కె.చెన్నయ్య, ఎస్.ఎజాస్ అహ్మద్, ఎల్.చంద్ర ఓబుళ్ రెడ్డి, వి.పర్వీన్ వి.మురళీకష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి, డి.రూతు ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజ

బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

జాతీయ స్థాయి పోటీల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ చివరి సంవత్సరం చదువుతున్న బి.అజయ్, ఎం.భువన, ఎస్.ఆర్ జాహ్నవి మదనపల్లెలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయా పోటీలలో టెక్నికల్ సింపోజియంలో ప్రతిభ కనపరచి మొదటి బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ఈ పోటీలలో నిర్వహించిన పరిశోధన పత్ర సమర్పణలో మొదటి బహుమతి పొందినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్, అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయులు ఆధ్వర్యంలో ఆదివారం ఆకులవీధిలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ-బాబు ష్యూరిటీ కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. శనివారం టిడిపి మహిళా నేత మిరియాల జ్యోతి చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి అడ్డుకోవడంతో వివాదం చోటు చేసుకొని పంచాయితీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లడం తెలిసిందే. ఐతే మర్రి రవి ఏరియా ఐన ఆకుల వీధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టిడిపి ఆదివారం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సమాయత్తమయ్యారు. పట్టణ సిఐ మద్దెయ్య ఆచారి ఆధ్వర్యంలో ఆదిలోనే అడ్డుకున్న పోలీసులను వారించి కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమం ఆకుల వీధి వరకు చేరుకోగానే పోలీసులు, టిడిపి శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శాంతి భద్రతల దృష్ట్యా కార్యక్రమాన్ని అంతటితో ఆపివేయాలని పోలీసులు సూచించడంతో ససేమిరా అన్న బత్యాల, పోలీసుల నడుమ వాగ్వాదం చోటుచేసుకుని పోలీసులు, టిడిపి శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. చివరికి పోలీసులు తోసుకుంటూ టిడిపి శ్రేణులు మర్రి రవి ఏరియాలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, రాజంపేట నియోజకవర్గంలోనూ దౌర్జన్య పాలన సాగుతోందని, అక్రమ కేసులకు భయపడేది లేదని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

23 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరంలో 23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, యర్రావారి పాలెం, కేవీపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో 23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు,మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ చేసుకున్న రోగిని పరీక్షిస్తున్న డాక్టర్

క్రికెట్ అభిమానుల సందడి

- భారీ తెరపై ఇండియా-ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్ వీక్షణ

క్రికెట్ చూసేందుకు భారీగా తరలివచ్చిన యువత, ప్రజలు, ఇండియా జెండా రెపరెపలు

ప్రజాశక్తి-కడప

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ఇండియా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను కడప నగర జిల్లా క్రికెట్ అభిమానులు, ప్రేక్షకులు వీక్షించే విధంగా అతిపెద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైంది. మ్యాచ్‌ను తిలకించేందుకు క్రికెట్ అభిమానులు వేలాది సంఖ్యలో హాజరయ్యారు. కడప ఆర్ట్స్ కాలేజ్ మైదానం జనంతో పోటెక్కిపోయింది. అంతకుముందు భారత జట్టు ప్రపంచ కప్ గెలవాలని కోరుకుంటూ కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఏసీఏ సౌత్ జోన్ అకాడమీ ఆధ్వర్యంలో కడప నగరంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అకాడమీ సభ్యులు క్రికెట్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజేంద్ర ప్రసాద్‌కు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన లగిశెట్టి రాజేంద్ర ప్రసాద్‌కు కర్నూలు, రాయలసీమ విశ్వవిద్యాలయం పిహెచ్‌డి ప్రదానం చేసింది. స్థానిక కామాటంవారిపల్లికి చెందిన సిద్దమ్మ, చంద్రయ్యల రెండో కుమారుడైన రాజేంద్ర ప్రసాద్ 10 ఏళ్లుగా గణిత ఉపన్యాసకుడిగా విధ్యార్థుల విద్యాభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్నాడు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో "ఎం.ఎస్.డి ఫ్లోస్ త్రూ ఫోరోస్ మీడియం" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి, కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమర్పించారు. ఆ పరిశోధనాగ్రంథాన్ని విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ల బృందం ఆమోదించింది. ఆదివారం డాక్టర్ రాజేంద్రప్రసాద్ పీలేరులో మీడియాతో మాట్లాడుతూ తన ఉన్నతికి తోడ్పాటు అందిస్తున్న గురువులు ప్రొఫెసర్ ఎంసి రాజు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావులకు ఈ సందరేగా కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఇరువైపుల ఉన్న బంకులు

కనిపించని ఆస్పత్రి ముఖద్వారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రభుత్వ ఆస్పత్రి ముఖద్వారం కనిపించ లేదని ప్రజలు ఆరోపించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట డ్రైనేజీ కాలువపై బంకులు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తుండే ముఖద్వారం కూడా కనపడలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఇలా డ్రైనేజీపై బంకులు ఏర్పాటు చేసుకున్న వారికి విద్యుత్ మీటర్లు కూడా మంజూరు చేయడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకొని డ్రైనేజీపై ఏర్పాటు చేసిన బంకులు తొలగిస్తే తప్ప ప్రభుత్వ కార్యాలయాలు కనపడే పరిస్థితి లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

కాలుష్యం కోరల్లో బస్టాండ్

ప్రజాశక్తి-గాలివీడు

హోటళ్ల నుంచి వెలువడుతున్న పొగ

గాలివీడు బస్టాండ్ ప్రాంగణం రోజురోజుకు పొగ కాలుష్యంతో నిండిపోతోంది. బస్టాండ్ చుట్టూ ఉన్న హోటళ్ల నుంచి వచ్చే పొగతో ప్రయాణీకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హోటళ్ల నిర్వాహకులు పొయ్యిలో వేసుకొని తుక్కు వాడుతున్నారని, పొగ బయటకు రాకుండా ఎత్తు ప్రాంతంలో పొగ గొట్టాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు చెబుతున్నారు. హోటళ్ల నుంచి పొగతో ఓ వైపు, సిగరేట్, బీడీలతో వచ్చే పొగతో మరోవైపు ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణీకులు ఆవేదన చెందుతున్నారు. పొగకాలుష్యం నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పగటిపూట వెలుగుతున్న వీధి దీపాలు

ప్రజాశక్తి-వీరబల్లి

వెలుగుతున్న విద్యుత్ దీపం

మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ కొన్ని గ్రామాల్లో కొన్ని నెలలుగా పగలు రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్ ఆదా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎల్ఇడి బల్బులను తీసుకొచ్చింది. క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలా పగటిపూట వీధి దీపాలు వెలుగుతుండడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందే తప్ప, విద్యుత్ ఆదా కాదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మనోహర్‌కు పూలమొక్కను అందిస్తున్న శ్రీనివాసరాజు

జనసేన పార్టీ పిఎసి చైర్మెన్ నాదెండ్ల మనోహర్‌ను డిఆర్‌డిఎ రాష్ట్ర మాజీ అధికారి, జనసేనపార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న ఎన్నికల్లో గెలుపు బావుటా ఎగురవేయాలని నాదెండ్ల మనోహర్ సూచించినట్టు ఆయన తెలియజేశారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాలను కలుపుకుని 2024 ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు శ్రీనివాసరాజు తెలిపారు. పార్టీ బలోపేతానికి ఒక సైనికుడిలా పోరాడుతామని అన్నారు. జనసేన సిద్ధాంతాలు, పవన్‌కళ్యాణ్ ఆశయాలు ప్రజలలోకి తీసుకెళ్లడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందని నాదెండ్ల మనోహర్‌కు తెలిపారు. నియోజకవర్గంలో శ్రీనివాసరాజు సేవలను ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ కొనియాడారు.

వైభవంగా స్ఫటిక శివలింగ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విగ్రహ ప్రతిష్టాపనలోపీఠాధిపతి

మండల పరిధిలోని బీరంగి గ్రామం గుగ్గూటి కొనలో వెలసిన శ్రీబండిస్వామి ఆలయంలో ఆదివారం స్ఫటిక శివలింగ ప్రతిష్ఠ మహోత్సవం, 221 విగ్రహాల ప్రతిష్ఠాపన ధ్యాన మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ పీఠాధిపతి,ధర్మకర్త పగడాల లక్ష్మీపతి స్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎక్కడలేని విధంగా 221 విగ్రహాల ఏర్పాటు చేశామని ఇవి భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, సరిహద్దు కర్ణాటక నుంచి ప్రజలు, భక్తులు పెద్దఎత్తున తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్ని వసతులు కల్పించామన్నారు. ఇందులో భాగంగా భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశామన్నారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బి.కొత్తకోటకు చెందిన ఆకుల మల్లికార్జున, సూరి జ్యువెలర్స్ సూరి, సబ్బీ పాల్గొన్నారు.

కార్యకర్తకు ఎంపిపి పరామర్శ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ కత్తెవాండ్లపల్లికి చెందిన వైసిపి కార్యకర్త నారాయణ సతీమణి నారాయణమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి అక్కడికి వెళ్లి నారాయణమ్మ మృతదేహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట వైసిపి నాయకులు మధుసూదన్ రెడ్డి, తాళ్ళ శ్రీధర్ రెడ్డి, రామాంజులురెడ్డి, డీలర్ బాబురెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీ శేఖర్‌రెడ్డి, జయన్న, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు వైసిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-కలకడ

వైసిపి కార్యకర్తల సమావేశాన్ని సోమవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిపి శ్రీదేవిరవికుమార్ మండల పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండలంలోని వైసిపి కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని తెలిపారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రెడ్డి సంఘం అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-కలికిరి

రెడ్డి సంక్షేమ సంఘ అభివృద్ధికి రెడ్డి వర్గీయులు సహకరించాలని పులి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో రెడ్డిసంక్షేమ సంఘం నాయకుల గృహప్రవేశానికి రెడ్డి వర్గీయులు హాజరయ్యారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సుమతిరెడ్డి, ఇల్లాల్‌రెడ్డి, పార్వతమ్మ పాల్గొని సత్కరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి అమర్నాథ్ రెడ్డి తాతిరెడ్డి, శేషు కుమార్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, మధు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కలికిరి

మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నయనార మధుబాల ఆదేశాలమేరకు కలికిరి గ్రంథాలయ అధికారి విజయకుమార్ అధ్యక్షతన దిశా చట్టం, మహిళా సాధికారికతపై చర్చ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు గుల్‌జార్ హజర్ మాట్లాడారు. గ్రంథాలయాలు విద్యార్థులకు జ్ఞానాన్ని పెంచే మహా వృక్షాలని అలాంటి గ్రంథాలయంలో చదివి ఒక గొప్పస్థాయికి ఎదగాలన్నారు. ఎంతో మంది మేధావులు, దేశనాయకులు రాసిన వారు మనతో లేకపోయినా వారి మాటలు పుస్తకాల రూపంలో మనతోనే ఉన్నాయని అన్నారు. నేడు సమాజంలో స్త్రీలు, ఆడపిల్లల పట్ల రక్షణ కరువైందన్నారు. గ్రంథాలయ అధికారి దిశ చట్టం పైన డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆత్మ రక్షణ పైన ఉపన్యాసం ఇవ్వడం జరిగింది. తదనంతరం గ్రంథాలయ అధికారి విజయకుమార్ వారిని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమానికి జిల్లాపరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు, మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె :** స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అధ్యక్షతన దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోర్డ్ లలితమ్మ ముఖ్య అతిథిగా విచ్చేసి గ్రంథాలయ ఉపయోగాలను గురించి పిల్లలకు వివరించారు. మహిళా పోలీసులు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి రావు దిశచట్టం గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. టి.యస్.ఎ. కృష్ణమూర్తి అంతర్ జాతీయ మహిళా దినోత్సవం గురించి తెలిపారు. ఉషారాణి ధ్యానం గురించి, శ్రీనివాస్ నాయుడు మానవతా విలువల గురించి తెలిపారు. కార్యక్రమంలో పార్డ్ సభ్యులు, జ్ఞానోదయ స్కూల్, బాపూజీ స్కూల్ జడ్‌పి. స్కూల్ విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు. **రామాపురం :** మండల కేంద్రమైన రామాపురంలోని శాఖ గ్రంథాలయంలోఆదివారం మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే వారోత్సవాలను శాఖ గ్రంథాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రంథాలయంలో జరిగే వారోత్సవాలకు విద్యార్థులు విశేష సంఖ్యలో పాల్గొంటారని అలాగే మహిళా దినోత్సవం సంద ర్భంగా మహిళలు పాల్గొంటున్నారని చెప్పారు స్థానికులు అందరూ గ్రంథాలయాలను విరివిగా ఉపయోగించుకొని తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పుస్తకాన్నిక్షిప్త కేంద్ర నిర్వాహకురాలు తారకేశ్వరి స్థానిక మహిళలు పాల్గొన్నారు. **గాలివీడు :** మహిళలు వంటింటికే పరిమిత కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. ఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. మహి ళలకు హక్కులను చట్టాలను సద్వినియోగం చేసుకొని మంచి మార్గంలో ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రరెడ్డి, పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరు శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి అమర్నాథ్ తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాంగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో దిశ చట్టం, మహిళా సాధికారత దినోత్సవం సందర్భముగా స్థానిక ఎఎస్ఐ హేమసుందర్, కానిస్టేబుల్ ఈశ్వర నాయుడు, మహిళా కానిస్టేబుల్ శ్యామల పిల్లకు దిశ చట్టం గురించి వివరించారు. అలాగే గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి చక్కగా వివరించారు. అనంతరం పిల్లలకు యధావిధిగా చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

గాలివీడు : బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథాలయ సిబ్బంది

రామాపురం : ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మహిళలు

నాసిరకం మద్యం.. ప్రాణాలతో చెలగాటం : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

మద్య నిషేధం చేస్తానని మహిళలకు మాటిచ్చిన జగన్మోహన్ రెడ్డి ఆ మాట మరచి నాసిరకం మద్యం అమ్మకాలు సాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పీలేరు పట్టణంలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిషత్తు గ్యారంటీ కార్యక్రమంలో కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త కొత్త బ్రాండ్ల పేర్లతో చెత్త మద్యాన్ని తయారు చేయించి జేబులు నింపుకొంటూ, నాసిరకం మద్యం బ్రాండ్లు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చేలాగాటమాడుతున్న జగన్ కు రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత లేదని చెప్పారు. రోజు రోజుకూ మద్యం ధరలు పెంచుతూ మందుబాబుల నడ్డి విరుస్తున్నాడని విమర్శించారు. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు పీలేరు, వాల్మీకిపురం, కలికిరి మండలాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు మంజూరయ్యాయని, మదనపల్లి నుంచి తిరుపతికి జాతీయ రహదారి చంద్రబాబు హయాంలోనే జరిగాయని అన్నారు. వాస్తవాలు తెలియని ఇక్కడి వైసిపి నాయకులు మేమే అభివృద్ధి చేస్తున్నామని చంకలు గుద్దుకోవడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. వాల్మీకిపురంలో సబ్ జైల్, ఫైర్ స్టేషన్ నిర్మాణం చేపడితే వాటికి ఈ ప్రభుత్వంలో కనీసం కిటికీలు పెట్టుకుని, పెయింట్ వేసుకునే పరిస్థితి కూడా లేదని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన మూడునెలల్లో యువ గళంనిధి కింద నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3 వేలు అందిస్తూ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తూ, అన్ని రకాలుగా ఆదుకునేందుకు తెలుగు దేశం పార్టీ బాధ్యత తీసు కుంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

- ఆర్‌టిసి డిపో మేనేజర్ ప్రవీణ్

ప్రజాశక్తి- జమ్మలమడుగు

కార్తీక మా సంలో శైవ క్షేత్రాల సందర్శన నిమిత్తం యాత్రికులకు జమ్మల మడుగు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని డిపో మేనేజన్ పివి ప్రవీణ్ తెలిపారు. ఈ నెల 20, 27, డిసెంబర్ 4, 11 తేదీల్లో సోమవారం ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. జమ్మలమడుగు నుండి ఉదయం 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు తిరిగి వస్తాయన్నారు. నయనాలప్ప కోన, యాగంటి, మహానంది, ఓంకారం వెళ్ల పెద్దలకు రూ.615, పిల్లలకు రూ.325 టిక్కెట్ ఛార్జీ ఉంటుందన్నారు. ప్రతి సోమవారం జమ్మలమడుగు నుండి ఉదయం 5 గంటలకు కడప మీదుగా పొలతలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశా మన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎం కోరారు.

నూతన ఎంపిడిఒకు అభినందనలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ఎంపిడిఒగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన దివిజాను పలువురు అభినందించారు. గ్రూపు-1లో ప్రతిభ చూపిన దివిజాను వేంపల్లె ఎంపిడిఒగా నియ మించారు. ఈ సందర్భంగా దివిజాను ఎంపిపి లక్ష్మి గాయత్రి ఘనంగా స్వాగ తించారు.దుశ్శాలవతో సత్కరించారు. గతంలో ఎంపిడిఒగా పని చేస్తున్న మల్లికార్జునరెడ్డి ఇఓపి ఆర్డిగా విధులు నిర్వహించనున్నారు. ఎంపిడిఒ బాధ్యతలు స్వీకరించిన దివిజాను ప్రజాప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు.

పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలని ఎపి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పెన్నా నగర్‌లో ఉన్న సిపిఐ కార్యాలయంలో ఆదివారం ప్రొద్దుటూరు ఏరియా అధ్యక్షుడు ఎం.సుధాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి, ఎఐటియుసి మాజీ జిల్లా కార్యదర్శి బి.రామయ్య మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి భవన నిర్మాణ కార్మికులను చిన్నచూపు చూడడమే కాకుండా సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. సమావేశంలో ఎపి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి ఏసోబు, కె.సుబ్బరాయుడు, ఎం.కుమార్, సుబ్బరాయుడు, వెంకటరమణ, సురేంద్ర, ఓబులేసు, పేపర్ శ్రీనివాసులు, షరీఫ్ పాల్గొన్నారు.

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- అధికారంలోకి రాగానే రాజోలి ఆనకట్ట నిర్మాణం : పుట్టా

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, తమ పార్టీ అధికారంలోకి రాగానే మైదుకూరు ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన రాజోలి ఆనకట్టను నిర్మించి తీరుతామని టిడిపి నియో జకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ 12వ వార్డులో అక్బర్ ఆధ్వర్యంలో ఆదివారం 300 మంది టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి హాజరయ్యారు. సమావేశంలో పుట్టా మాట్లాడుతూ మైదు కూరు ప్రాంత రైతులు రాజోలి ఆనకట్ట నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రస్తుత సిఎం శిలాఫలకానికే పరిమితమయ్యారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే రాజోలు ఆనకట్టను పూర్తి చేస్తా మన్నారు. గతంలో పార్టీలోకి రావాలని అక్బర్‌ను కోరినప్పటికీ స్పందిం చలేదన్నారు. ప్రస్తుతం వార్డులో అభివృద్ధి జరగలేదని గుర్తించి స్వచ్ఛందంగా టిడిపిలో చేరారన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి, నీటి సమస్య పరిష్కారానికి గతంలో తాము ఎంతగానో కృషి చేశామన్నారు. తమ హయాంలో ప్రతిపాదించిన పనులనే ప్రస్తుత ప్రభుత్వం అరకోరగా చేస్తుందన్నారు. వార్డు ఇన్‌ఛార్జిగా అక్బర్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.మల్హోత్రా, టిడిపి నాయకులు ధనపాల జగన్, దాసరి బాబు, బిపి సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి ఐక్యంగా పనిచేస్తాం

వేంపల్లె : పులివెందుల నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి కలిసికట్టుగా పని చేస్తామని జనసేన సమన్వయ కర్త డాక్టర్ హరీష్ తెలిపారు. ఆదివారం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్‌ను జనసేన నాయకులు కలి శారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ కార్యా చరణపై ఆయా పార్టీ నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. పులి వెందులలో బిటెక్ రవీంద్ర నాథ్‌రెడ్డి విజయం కోసం జనసేన నాయకులు టిడిపికి సహకరించాలని కోరారు. జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేసినట్లు తెలిపారు. సమా వేశంలో టిడిపి నాయకులు జయచంద్రారెడ్డి, ఆర్‌వి రమేష్, పీరా సాహెబ్, అల్లాబకష్, వేమా నారా యణ, డక్కా రమేష్, మహ మ్మద్ ఇనాయతుల్లా, అల్లా బకష్, మడక శ్రీని వాసులు, ఈశ్వరయ్య, గొటూరు నాగభూషణం, జనసేన నాయకులు చైతన్య, శ్యామ్, మహేంద్ర, మల్లికార్జున, నంద పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆదివారం ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇందిరమ్మకు ఉక్కు మహిళగా పేరు వచ్చిందన్నారు. కాంగ్రెసు పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి ఇందిరమ్మ అన్నారు. ఇందిరమ్మ చేసిన సేవలు ఇప్పటికీ ప్రజలు మరవలేనివని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, నరసింహారెడ్డి, అమర్నాథ్, వేమయ్య, ఉత్తన్న, బాబు, సుబ్బరాయుడు, మాస్‌బాషా పాల్గొన్నారు.

ముద్దనూరు సమితి కార్యవర్గ సభ్యుల ఎన్నిక

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం పంచాయతీ రాజ్ ముద్దనూరు సమితి కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా ఎస్.అమీర్‌బాషా (కొండాపురం), అసోసియేట్ అధ్యక్షులు కె.ప్రతాప్ (కొండాపురం), ఉపాధ్యక్షులు ఎం.కిషోర్‌కుమార్ (మైలవరం), కార్యదర్శి ఎం మహబూబ్ బాషా (జడ్పీహెచ్‌ఎస్ ఉప్పలూరు) ,సంయుక్త కార్యదర్శి జి.కుమారి (ముద్దనూరు), కోశాధికారి ఎం.లక్ష్మీదేవి (జెడ్పి హెచ్‌ఎస్ వేపరాల), కో-ఆప్షన్ సభ్యులు రంగనాయకుమ్మ (ముద్దనూరు) ,ఈసీ మెంబర్ పి.వైష్ణవి (జడ్పిహెచ్‌ఎస్ లావనూరు) ఎన్నుకున్నారు.

నేడు మైదుకూరులో వైసిపి బస్సు యాత్ర

చాపాడు : వైసిపి చేపట్టిన సాధికార బస్సు యాత్ర సోమవారం మధ్యాహ్నానికి మైదుకూరు చేరుకోనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో హోమ్ మంత్రి తానేటి వనిత, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, వైసిపి నాయకులు బీద మస్తాన్, కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్‌ఖాన్, జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రీజినల్ కో -ఆర్డినేటర్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పాల్గొంటారని ఆ పార్టీ నాయకులు తెలిపారు.మైదుకూరు నాలుగు రోడ్లలో వైసిపి జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

వైసిపి పాలనలో రోడ్లన్నీ గుంతలమయం : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి పాలనలో రోడ్లన్నీ గుంతలమయమైపోయాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగలరాయుడు తెలిపారు. ఆదివారం ఇసుకపల్లెలో టిడిపి, జనసేన సంయుక్తంగా గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది కార్యక్రమం నిర్వహించారు. గుంతలమయమైన రోడ్డులో మొక్కలునాటి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఎటు చూసినా రోడ్లన్నీ గుంతల గుంతలమయమై తరచూ ప్రమాదాలు చోటు చేసు కుంటున్నా, ప్రాణాలు గాలిలోకి ఎగిరిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేదన్నారు. ఇదే ఇసుకపల్లి రోడ్డులో ఇటీవల ఓ గర్భిణిని ఆటోలో ప్రయాణం చేస్తూ గుంతల ధాటికి రోడ్డులోనే ప్రస వించిందని, నాటి నుంచి ఈ రహదారికి కాన్పుల గుంతగా పేరు వచ్చిందని వైసిపి పాలనలో రహదారులు ఈ విధంగా ఉన్నాయని తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకా లలో కనీ సం ఒక్క శాతం ఖర్చుపెట్టినా రాష్ట్రంలో రోడ్లకు ఈ దయనీయ పరిస్థితి ఉండేది కాదని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి-కలకడ

పైప్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ ఎదుట తాగునీరు వృథాగా పోతున్నా ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదు. మండలంలో ఝరికోన ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేసేందుకు గత ఉమ్మడి రాష్ట్ర ముఖ్య మంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఝరికోన ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా కలకడ, కలికిరి మండలాలకు నీటిని అందిం చాలని ఉద్దేశంతో పైపులైన్ ఏర్పాటు చేశారు. పైపులైను అక్కడక్కడ చిల్లులు పడి నీరు వృథాగా పోతున్న ఏమాత్రం పట్టించుకోలేదని స్థానికులు వాపోతు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

కంటి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని క్లబ్ అధ్యక్షులు జి. సురేంద్రమాత రెడ్డి తెలిపారు. తిరుపతి అరవింద్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం స్థానిక ప్రసాద్ నర్సింగ్ హోమ్‌లో లయన్స్‌క్లబ్ ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్యులు 40 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 15 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన వారి తిరుపతి అరవింద్ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్ల అనంతరం వారి స్వస్థలాలకు చేర్చడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సురేంద్ర నాథరెడ్డి, కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి జయచంద్రనాయుడు, సభ్యులు డాక్టర్ ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, పివి రమణ, శశిధర్ రెడ్డి, నాగబాలాజీ పాల్గొన్నారు.

వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఝాన్సీ లక్ష్మీబాయి వీరవనిత అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సాయంత్రం వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయి తెలివి, ధైర్యసహాసాలుగలదని కొనియాడారు. 1857 సిపాయిల తిరుగుబాటులో ప్రముఖస్థానం వహించి తన బిడ్డను వీపునకు కట్టుకొని ఆంగ్లేయులతో పోరాడిన గొప్ప దేశభక్తురాలు అన్నారు. జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయి పోరాటపటిమ నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అంకాల్ కొండయ్య, సాయికుమార్, వారాది మధు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మినీ వ్యాన్, బైక్ ఢీ

ఇద్దరు దుర్మరణం : మరొకరి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఈశ్వరనారాయణ(ఫైల్ ఫొటో)

హుస్సేన్(ఫైల్ ఫొటో)

మండల పరిధిలోని పుత్తనవారిపల్లె జాతీయ రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మినీ వ్యానును బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పుల్లంపేట శ్రీరాముల పేటలో నివాసముంటున్న చెందిన ఈశ్వరనారాయణ(21), హుస్సేన్(17) బాలు అనే ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై వెళుతుండగా పుత్తనపల్లి జాతీ యరహదారిలో ముందు వస్తున్న వాహనాన్ని అధిగమనించేందుకు ప్రయత్నిం చగా ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్‌ను ఢీ కొట్టారని తెలిపారు. ఈ ప్రమాదంలో ఈశ్వనారాయణ, హుస్సేన్‌లు అక్కడిక్కడే మృతి చెందగా, బాలు తీవ్రంగా గాయ పడినట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారిని శవపరీక్ష కోసం రాజం పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని, తీవ్ర గాయాలతో గాయపడిన బాలును ప్రథమ చికిత్స కోసం తిరుపతికి పంపినట్లు తెలిపారు. ఈఘటనపై కేసునమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి-రామసముద్రం

రామసముద్రంలో ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో ప్రజలు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించినట్లయితే చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ ధరించకపోవడం ,సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగం, త్రిబుల్ రైడింగ్ లాంటి నిబంధనలు అతిక్రమించకూడదన్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసునమోదు చేస్తామన్నారు.